క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: 11కేవీ టౌన్ -3ఫీడర్ పరిధిలో జూన్‌లో చేపట్టిన టీజీఏఐఎంఎస్ సర్వేలో వెలుగులోకి వచ్చిన శిథిలావస్థకు చేరిన స్తంభాలు, చెట్ల కొమ్మల తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరాఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్, నల్లకుంట, లింగంబావి, శ్రీనివాస కాలనీ, గంజి రోడ్డు, చింతలపేట, పెద్ద అగ్రహారంలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు జిల్లా సదస్సును జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: ఈనెల 17న జిల్లా కేంద్రంలో ఐకేపీ వీఓఏ ఉద్యోగ సంఘం జిల్లా సదస్సును నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, అధ్యక్షుడు రాజీకుమార్, సహాయ కార్యదర్శి నాగేష్‌లు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వీఓఏలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, ఐకేపీ వీఓఏ ఉద్యోగం సంఘం నాయకులు తిమ్మప్ప, తిరుమల్ కుమార్ ఉన్నారు.

మూగజీవాల అపహరణ

గద్వాల క్రైం: వ్యవసాయ పొలంలో కట్టేసిన మూగజీవాలను గుర్తు తెలియని దుండగులు అపహరించిన సంఘటన గద్వాల మండలం గోనుపాడులో గురువారం తెల్లవారు జమున చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మణ్, జహీర్‌లు గ్రామ శివారులోని వారి వ్యవసాయ పొలంలో రెండు ఎద్దులు, ఆవు, దూడను కట్టేసి వెళ్లారు. రోజు వారి పనుల నిమిత్తం వ్యవసాయ పొలంలో వచ్చి చూడగా వారి మూగజీవాలు కన్పించకపోవడంపై పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఎలాంటి ఫలితం లేకపోయింది. మూగజీవాలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. మూగజీవాల విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు.

బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేత



అయిజ: ఇటీవల మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి ఊరట లభించింది. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసిన 25 మొబైల్స్‌ను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విజయభాస్కర్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 385 మొబైల్స్ రికవరీ చేసినట్లు తెలిపారు. మొబైల్స్ పోగొట్టుకున్న వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో సంబంధిత వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ బృందం పాల్గొన్నారు.

పాఠశాలకు టార్పాలిన్‌లు అందజేత



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలోని శాంతినగర్ యూపీఎస్ పాఠశాలలో ఫ్లోరింగ్ బండలు తొలగించి వేయకపోవడంతో తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చోవడానికి ఇబ్బందికరంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న పైపాడుకు చెందిన ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగి రవీంద్రనాథ్‌రెడ్డి రెండు టార్పాలిన్‌లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటనర్సమ్మకు అందజేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

శాంతినగర్: పొలం తగాదాలో వ్యక్తిపై దాడి చేయడంతో ఇద్దరిపై కేసు నమోదైన సంఘటన వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పరి రాఘవేంద్రపై పొలం తగాదా విషయంలో అదే గ్రామానికి చెందిన రంగస్వామి, ఆంజనేయులు దాడి చేశారు. దీంతో రాఘవేంద్ర తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు రంగస్వామి, ఆంజనేయులుపై కేసు నమోదు చేసి, రాఘవేంద్రను అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపినట్లు ఏఎస్ఐ అయ్యన్న తెలిపారు.



అలంపూర్ కోర్టులో జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్న జడ్జి కమలాపురం కవిత



క్యాతూర్ పీహెచ్‌సీ దగ్గర జాతీయ జెండా ఎగరేస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనరాణి



కొంకలలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు



కేటీదొడ్డిలో జెండావిష్కరణలో పాల్గొన్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్, పోలీసులు

జాతీయ జెండా రెపరెపలు

- ఘనంగా 78వ స్వాతంత్య్ర దినోత్సవం
- వేడుకల్లో ఎమ్మెల్యే విజయుడు
- తెల్లవారుజామున విద్యార్థుల ప్రభాతభేరీ

అలంపూర్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా రెపరెపలాడింది. జాతీయ సమైక్యతను పెంపొందించే జాతీయ పతాకం వాడవాడలా ఐక్యతను చాటింది. అలంపూర్ నియోజకవర్గంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులకు నివాళులర్పించారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవిత జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం, గాంధీ చౌక్‌లోని మహాత్ముని విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పద్మావతి, న్యూప్లాట్స్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎంఈఓ అశోక్‌కుమార్, లైబ్రరీ వద్ద లైబ్రేరియన్ మాణికమ్మ, ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ హనుమనాయక్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నాగరాజు, వ్యవసాయ కారాలయంలో ఏడీఏ సక్రియ నాయక్, ఎస్‌బీఐ వద్ద మేనేజర్ రమేష్‌లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలంపూర్ చౌరస్తాలోని విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ ఆవిష్కరించారు.

అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

అలంపూర్ రూరల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కార్యాలయాల దగ్గర మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనరాణి జాతీయ పతాకం ఎగురవేశారు.

విద్యార్థులకు పారితోషకం : క్యాతూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు 1993–94 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు మూడేళ్లుగా 8, 9, 10వ తరగతుల్లో మొదటి, రెండో ర్యాంక్ సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలంపూర్ మండలంలోని కెనరా బ్యాంక్ క్యాతూర్ శాఖ వారు ఎంపీపీఎస్ పాఠశాలలో 5, 6, 7 ఎస్సీ, ఎస్టీ మెరిట్ విద్యార్థులకు రూ.3 వేలు, 8, 9, 10 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.5 వేల చొప్పున అందజేశారు.

జోగుళాంబ ఆలయంలో..

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయం ముందు రాజగోపురం దగ్గర త్రివర్ణపతాకం రెపరెపలాడింది. హర్‌ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా ఇంటింటిపై త్రివర్ణ పతాకం ఎగరేశారు.

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలి

గద్వాల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల ప్రతిభను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని జీహెచ్‌ఎం ఇమ్మానియేల్ పేర్కొన్నారు. 1999–20 పదో తరగతి పూర్వ విద్యార్థులు ప్రతిభ చాటిన పది విద్యార్థులకు నగదు బహుమతులు ప్రకటించారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండా రెపరెపలాడింది. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అబ్దుల్ సుకూర్, జెన్‌కో జల విద్యుత్ కేంద్రం వద్ద ఎస్ఈ రామసుబ్బారెడ్డి జాతీయ జెండాలు ఎగరవేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ వెంకట్రావు, ఎంపీడీఓ మంజుల, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, వార్డెన్లు నర్సింహులు, సుధీర్ గౌడ్‌లు జెండా ఎగరవేశారు.

అలరించిన చిన్నారుల వేషధారణ

ధరూరులో చిన్నారుల దేశ నాయకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాల క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ జెండా ఎగరవేశారు. పాతపాలెంలో విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

2024 మార్చి 10వ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన ధరూరుకు చెందిన విద్యార్థి సరాజ్‌కు మండల స్పెషలాఫీసర్ రమేష్‌బాబు పంపిన నగదును జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అందజేశారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తిరుపతన్న, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సలీముద్దీన్, రైతు సంఘం సభ్యులు, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు త్రివర్ణ పతాకాలు ఎగరవేశారు.

రాజోళి: ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, వ్యాపార సముదాయాల్లో, ప్రైవేట్ సంస్థల వద్ద జాతీయ జెండా రెపరెపలాడింది. దేశ నాయకుల గురించి స్వాతంత్య్ర పోరాటం అధికారులు తెలిపారు.

అయిజ: మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. చిన్నారులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

మానవపాడు: మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో, తహసీల్దార్ వాహిదా ఖాతూన్, సహకార సంఘంనందు పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, కళాశాలు ప్రిన్స్‌పల్, ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు మెమొంటోలు, బహుమతులు అందజేశారు.

మల్దకల్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ సురేష్‌గౌడు, సింగిల్ విండో కార్యాలయం వద్ద తిమ్మారెడ్డి, ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ స్వరూపరాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్సింహులు జెండాలు ఎగరవేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండా ఎగరవేశారు.

గట్టు: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ కార్యాలయలో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మల్లేష్ జాతీయ జెండాలు ఎగరవేశారు. పీఏసీఎస్‌లో అధ్యక్షుడు వెంకటేష్, చేనేత సంఘం దగ్గర పర్సన్ ఇన్‌చార్జి దోమ వీరన్న, పంచాయతీ దగ్గర స్పెషల్ ఆఫీసర్ నదీమ్, రైతు వేదిక దగ్గర ఏఓ హనుమంతురెడ్డి, విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర ఏఈ చెన్నయ్య, కాలేజీలో కేఎస్‌డీ రాజు, కేజీబీవీలో గోపీలత, గురుకులంలో ప్రిన్సిపల్ జాతీయ జెండాల పతాకాలు ఆవిష్కరించారు. చాగదోణలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ జాతీయ జెండా ఎగరేశారు.

మహనీయుల త్యాగాలతోనే దేశానికి స్వేచ్ఛ

- ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: మహనీయుల త్యాగాలతోనే దేశానికి స్వేచ్ఛ సిద్ధించిందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహనీయుల చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత దేశానికి వ్యాపార విస్తరణకు వచ్చిన ఆంగ్లేయులు భారతీయులపైనే పెత్తనం చెలాయించారన్నారు. మహనీయుల ప్రాణత్యాగాలతో దేశానికి స్వాతంత్య్ర లభించిందన్నారు. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, చాచా నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవన్న, వావిలాల రంగారెడ్డి, కిషోర్, గోపాల్, రఘురెడ్డి, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, భాస్కర్ ఉన్నారు.



అలంపూర్ చౌరస్తా క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



ఉండవెల్లి ఎంపీడీఓ కార్యాలయంపై జెండా ఎగరవేస్తున్న ఎంపీడీఓ



మానవపాడు సహకార సంఘం కార్యాలయంలో..



అలంపూర్‌లో మాంటిస్సోరిలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



ధరూరులో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



ప్రభాతభేరీలో పాల్గొన్న విద్యార్థులు




గట్టు తహసీల్దార్ కార్యాలయంలో..



రామాపురం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో జాతీయ జెండా ఎగరవేస్తున్న ఎంఈఓ నరసింహ



రాజోళి పోలీస్ స్టేషన్‌లో..



అయిజలో మున్సిపల్ కార్యాలయం వద్ద..

జడ్జిలకు న్యాయవాదుల సన్మానం



అలంపూర్ కోర్టులో జిల్లా, జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలతో న్యాయవాదులు

అలంపూర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకోని జడ్జిలను న్యాయవాదులు సన్మానించారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జడ్జిలను, సీనియర్ న్యాయవాదులకు సన్మానం ఏర్పాటు చేశారు. జిల్లా జడ్జి కుశ, జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవితలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్ జిల్లా జడ్జిని, జూనియర్ సివిల్ జడ్జిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కోర్టులో సీనియర్ న్యాయవాదులు నారాయణ రెడ్డి, శాంతిమల్లప్ప, యుదుర్ బాషలను జిల్లా జడ్జి శాలువాతో సత్కరించారు. న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిని మాజీ ఏజీపీ నరసింహ సత్కరించారు. నూతన కమిటీ సభ్యులు జడ్జిలను, సీనియర్ న్యాయవాదులను సన్మానించడం వంటి మంచి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఏజీపీ మధు, న్యాయవాదుల సంఘం కమిటీ సభ్యులు ఆంజనేయులు, చిన్న కిషన్ రావు, న్యాయవాదులు రాజేశ్వరి, తిమ్మారెడ్డి, యాకోబు, నరసింహ, శ్రీధర్ రెడ్డి, నాగరాజు యాదవ్ ఉన్నారు.



జీహెచ్‌ఎంలను సన్మానించిన సోషల్ ఫోరం నాయకులు

సోషల్ ఫోరం ఆధ్వర్యంలో హెచ్ఎంలకు..

గద్వాల: జిల్లాలో జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఘనంగా సన్మానించింది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంలుగా నారాయణచారి, ఉషారాణి, శోభరాణి, నాగరాజు, రెడ్యానాయక్, సోమశేఖర్ రెడ్డి, వెంకటేష్, అన్వర్‌హుల్‌హక్, జఫరుల్లాలు పదోన్నతి పొందారు. వారిని సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు వెంకటనర్సయ్య, నగేష్, నారాయణరావు, వెంకటేష్‌శెట్టి, శ్రీనివాసులు, బుచ్చన్న, రాజుసాగర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశక్తి పీఠాల్లో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించాలని కోరుతూ గురువారం కర్నూలులో మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజును ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ కలిశారు. తుంగభద్ర నదిపై బ్రిడ్జి పూర్తి కావడంతో భక్తులు ఈ మార్గం గుండా శ్రీశైలం వెళ్తుంటారని, బ్రిడ్జి ఆవలి ప్రదేశంలో రోడ్లు వేయాలని కోరారు. బ్రాహ్మణ కొట్కూరు వద్ద జోగుళాంబ ఆలయాలు తెలిసేలా ఆర్చిగేట్ నిర్మాణం చేయనున్నట్లు, ఇందుకు సహకరించాలన్నారు. అలాగే కర్నూలు జిల్లాలో అలంపూర్ ఆలయాలకు సంబంధించిన భూములకు రక్షణ కల్పించాలని కోరారు. పార్లమెంటులో అలంపూర్ ఆలయాల అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతానని, కేంద్రం నుండి మరిన్ని నిధులకు ప్రయత్నిస్తానని ఎంపీ హామీ ఇచ్చారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



అయిజ: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల్లో ప్రజలు మృతి చెందుతున్నారని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ విజయ భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రలో ఎమ్మార్ మోటార్స్ బజాజ్ షోరూం వారు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ జెండాఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్‌లపై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల యువకులు ఉన్నారు.

ప్రోటోకాల్ పాటించలేదని మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం

గద్వాల రూరల్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో అధికారులు పట్టణ ప్రథమ పౌరుడైన తనను ఆహ్వానించకుండా అవమానపర్చారని గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్వాలలో అధికారులదే సర్వాధికారం అన్న తరహాలో పాలన జరుగుతుందని, ప్రజలచేత ఎన్నుకోబడిన తమలాంటి ప్రజాప్రతినిధులను అధికారులు ఉద్దేశ్యపూర్వకంగానే అవమానించారని మండిపడ్డారు. కౌన్సిలర్లకు కూడా ఆహ్వానం అందలేదన్నారు. దీనిపై ఉన్నతస్థాయిలో ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



ధరూరు: తన వ్యవసాయ పొలానికి వెళ్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కేటీదొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన తెలుగు తులసీరామ్ (50) ఈ నెల 6న మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు కేటీదొడ్డి పోలీసులు తెలిపారు.

మంచి పనులే శాశ్వత గుర్తింపునిస్తాయి



ఉద్యోగులను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

జోగుళాంబ శక్తిపీఠం: ఉద్యోగులు ఎక్కడ పని చేసినా విధినిర్వహణలో అంకితభావంతో పని చేస్తే ఆ పనులే వారికి శాశ్వత గుర్తింపును తీసుకొస్తాయని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. గురువారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన కురుకుంద శ్రీనివాస్‌లు,, శేఖర్‌రెడ్డిలు బీచుపల్లి దేవస్థానం, కురుమూర్తి దేవస్థానంకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో బీచుపల్లి దేవస్థానం నుంచి సాంబశివుడు, జమ్మిచేడు జమ్ములమ్మ దేవస్థానం నుంచి సంజీవరెడ్డిలు అలంపూర్ ఆలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారికి వీడ్కోలు, వీరికి స్వాగత సభను ఏర్పాటు చేశారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఈశ్వరమ్మకు దేవస్థానం తరఫున రూ.2లక్షలు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్‌ను ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు బ్రహ్మయ్య, శేఖర్, ప్రదీప్, శ్రీకాంత్,, గోపి, రాజేష్, మహేష్ తదితరులు ఉన్నారు

టాపర్లకు నగదు బహుమతి అందజేత

గట్టు: గ్రామ స్వరాజ్యం సేవా సంస్థ ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుతులు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకుంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గ్రామ స్వరాజ్యం సేవా సంస్థ గౌరవ సలహాదారుడు సత్యనారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు నగదు బహుతులను అందజేశారు. గ్రామ స్వరాజ్యం సేవా సంస్థను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు నగదు బహుమతి

ధరూరు: 2024 మార్చి 10వ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన ధరూరుకు చెందిన విద్యార్థి సరాజ్‌కు మండల స్పెషలాఫీసర్ రమేష్‌బాబు పంపిన నగదు బహుమతిని జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అందజేశారు.



గట్టులో ఎస్ఎస్‌సీ, ఇంటర్ టాపర్లకు నగదు బహుమతి అందజేస్తున్న సత్యనారాయణ